# చిల్లుల కంబళి

బొమ్మిరెడ్డిపల్లి సుబ్బారావు

సూర్యారావు వృత్తిరీత్యా పాత్రికేయులు. రచయితగా కూడా గొప్ప కథలను అందించారు. వారి కథలు పలు భాషలలోకి అనువాదితమైనాయి. హెరాల్డ్ ట్రిబ్యూన్ నిర్వహించిన అంతర్జాతీయ కథల పోటీలో వీరి కథ "దొంగలున్నారు జాగ్రత్త" జాతీయ స్థాయిలో బహుమతిని గెల్చుకుంది. కథావాహిని, సువర్ణరేఖలు మొదలైన కథా సంకలనాలు వెలువడ్డాయి. వీరి కథలలో ముగింపు పాఠకులను చకితులను చేస్తుంది.

పల్లె కప్పుకున్న చీకటి కంబళికి అక్కడక్కడ చిల్లులుపడి దివ్వెల వెలుగు కానవస్తూంది. రాత్రి తొమ్మిది గంటలు కూడా అయివుండదు. కాని ఊరు నిశ్శబ్దమయింది. అక్కడా అక్కడా అరుగులమీద నలుగురైదుగురు కూర్చుని చుట్టలు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. చుట్టల నిప్పు ఎగరని మిణుగురుల్లా మినుకు మినుకు మంటున్నాయి.

పాకముందు అరుగుమీద కూర్చుని బైరాగి రామస్వామి ఒంటితీగ సితారు వాయిస్తూ రామదాసు కీర్తన పాడుతున్నాడు. బైరాగి గొంతుక భయంకరంగా వుంది. కాని యిరుగు పొరుగున నిద్రపోతున్నవారు రామదాసు కీర్తనకు అభ్యంతరం చెప్పరు. పల్లెలో రాత్రుళ్లు కుక్కల అరుపులలాగనే ఈ పాట కూడా వారికి అలవాటయింది. మేనల్లుడు సత్యం అప్పుడే అన్నం తిని జీర్రున తేన్చుకుంటూ బయటికొచ్చాడు.

"ఏం మామా, వసారాలో చాపేసి లాంత రెట్టమంటావేటి?"

అంటూ బైరాగి పాట కద్దుతగిలాడు. బైరాగి సితారు కిందపెట్టి "ఊ. ఎయ్యిరా ఎదవా, రోజూ అడగాలేటి?" అంటూ కసిరేడు.

"అదికాదు మామా, రెండు రోజులయి పోలీసులు గస్తీ తిరుగుతున్నార్రోయ్ అని కలట్రాఫీసు బంట్రోతు బసవయ్య చెప్పేడు మామా!"

"ఆడి సిగాగొయ్యిరి. ఆడే కలట్రారులా మాటాడుతాడు. ఒరే సత్తెం, పోలీసుల సంగతి నాకు చెబుతావేట్రా. నాకు తెలీదా? ఆరుసార్లు కైదులో కెల్లినోడిని, ఆళ్ళు అలా రూమరు పుట్టిస్తారంతే. అంటే ఒదంతి లేవతీస్తారు! మనుషులు బయపడ్డానికి."

మేనమామ చరిత్ర సత్యానికి తెలుసు. సందర్భం వున్నా లేకపోయినా బైరాగి తన జీవితగాథ సగర్వంగా చెబుతూ వుంటాడు. బైరాగికి వ్రాయడం చేతకాదు. లేకపోతే తన ఆత్మకథ తప్పక వ్రాసేవాడే.

ఆత్మవిశ్వాసం, గర్వం రాముడికి పుట్టుకతోనే వచ్చాయి. చిన్నప్పటి నుంచీ కసరత్తు చేసిన శరీరం యౌవనం రాగానే బాగా కండలు తిరిగి పందెపు గుర్రంలా నిగనిగలాడుతూ వుండేది. రోజులన్నీ శరీరాన్ని వృద్ధి చేసుకోవడంతోనే గడపడం వల్ల ఎప్పుడూ ఒళ్లువంచి పనిచేసిన పాపాన పోలేదు. తాను వలచిన పిల్లనే పెళ్ళిచేసుకుంటానని తండ్రితో పోట్లాడి, పెళ్ళి

## ఆణిముత్యాలు

చేసుకుని, అత్త వారింట్లోనే తిష్ఠ వేశాడు. అత్తమామల పోరువల్ల రోజూ జూదమాడో జేబుకొట్టో నాలుగు డబ్బులు తెచ్చి యింట్లో యివ్వక తప్పేదికాదు. ఒకసారి పట్టుబడి ఆరుమాసాలు జైలుకెళ్ళేడు. జైలునుంచి తిరిగొచ్చేసరికి భార్య ఆడపిల్లని కని చనిపోయింది. కూతురు పోషణ కోసం తాను దొంగతనాలు చేస్తూ డబ్బుతెచ్చి యిచ్చేవాడు. ఊళ్ళుపట్టి, జైళ్ళకెళుతూ వస్తూ ఓ పదిహేనేళ్ల పాటు గడిపి యింటికొచ్చేసరికి ముసలి అత్తామామ చనిపోవడంతో కూతురుని తానే చూసుకోవలసి వచ్చింది. కూతురికి యుక్తవయసు రావడం వల్ల దానిని ఒంటరిగా వదిలి ఊళ్ళంట తిరగడానికి వీలులేక ఊళ్ళోనే పాకేసుకుని స్థిరపడ్డాడు. వయస్సు మళ్ళి ఒంట్లో ఓపిక సన్నగిల్లింది. గత జీవితం మీద విరక్తి గలిగి మళ్ళీ క్రొత్త జీవితం ప్రారంభించాలనుకుని,

సన్యసించి కాషాయ బట్టలు వేశాడు. ఒంటితీగ సితారు సంపాదించాడు. రాముడు రామస్వామి అయేడు కాని జరుగుబాటెలాగ? ఇంట్లో చేరిన మేనల్లుడు సోమరి పోతు. దమ్మిడి సంపాదించి తీసుకురాడు. అందుకే తన పాకలో వీధి వసారాలో చాపేసి, లాంతరు పెట్టి జూదగాళ్లను చేర్చి బాడుగ పుచ్చుకుంటూ వుంటాడు. చాపవెయ్యడం, దీపం పెట్టడం, వీధి గుమ్మంలో పోలీసుల జాడ కనిపిస్తే ముందుగా వచ్చి చెప్పడం మేనల్లుడికి డ్యూటి. కబురంపగానే బైరాగి దీపమార్పేస్తాడు. ఎక్కడి వాళ్లక్కడ జారుకుంటారు.

మేనల్లుడికి మేనమామ పోలికే వచ్చింది. మంచి బలమైన శరీరం. ఉంగరాల జుట్టూ అందంగా వుంటాడు. కాని మేనమామకంటె తెలివైనవాడు. కొద్దిగా చదువుకున్నాడు. అయితే ఒళ్లొంచి పని చెయ్యడు. అంచేతే బైరాగికి మేనల్లుడంటే కోపం.

బైరాగి కూతురు గవరమ్మ చిలుంగొట్టం, అగ్గిపెట్టె తెచ్చి యిచ్చింది. బైరాగి గొట్టంలో చిలుం దట్టించి అగ్గిపుల్ల వెలిగించి "ఏమమ్మా ఇయాల మీ మేనమామ ఉత్తరమేశాడు. తన కొడుక్కి మునసబు కచేరీలో బంట్రోతు పనయిందట" అన్నాడు.

గవరమ్మ సత్యాన్ని చూసి చిరునవ్వు నవ్వింది. గవరమ్మ చిరునవ్వుకి సత్యం ఒళ్ళు పులకరించింది. గవరమ్మ చక్కదనం చీకట్లో దీపం లాంటిది. ఎవర్నికైనా ప్రాణం లేచొస్తుంది. ఆ చిరునవ్వు ఎందుకు విసిరిందో సత్యానికి తెలుసు. ముందుగానే గవరమ్మ ఆ ఉత్తరాన్ని రహస్యంగా చదివించుకుని విన్నది. మేనమామ గవరమ్మను తన కొడుక్కిచ్చి పెళ్ళి చెయ్యమంటాడు. బైరాగికి కూడా అదే వుద్దేశం.

"అయితే ఒకటే చిక్కు. నిన్నాడికిచ్చి పెళ్ళిచేస్తే నేనిక్క డొంటరిగా ఏం చెయ్యాల? మకామెత్తేసి నేను కూడా నీ దగ్గరకే వొచ్చాయాల" అంటూ ఆలోచనలో పడ్డాడు బైరాగి. నిజమే, కూతురి నొదిలి ఒక్కక్షణమైనా వుండలేడు, బైరాగికి కూతురంటే ఎంతో అనురాగం.

"ఊ, అదే చెయ్యాల, ఇంత మంచి సంబంధం మళ్ళీ రాదు. ఇక్కడ నుంచి మకామెత్తేసి పోదాం" అన్నాడు బైరాగి ఒక నిశ్చయానికి ఒచ్చినట్లుగా.

"పోనీలే నాయనా, యిప్పుడేం తొందర" అన్నాది గవరమ్మ.

"తొందర కాదటమ్మా!"

"అయినా ఆడ్ని నేను చేసుకోను నాయనా. ఆడో కసాయోడు దయాదాచ్చిన్నాలు లేవు."

"బాగుందే నువ్వన్నమాట. అందుకనే ఆడు నెలకు నూరు రూపాయలు గడిస్తున్నాడు. జీతం కాక పైన కూడా దొరుకుతాయట. దయాదాచ్చిన్నాలుంటే ఎవడూ దమ్మిడి గడించలేడే ఎర్రితల్లి. నాలాంటి బైరాగోడికి వుండాల్సిన గుణమది. గడించాల్సిన ఓడికి కాదు. ఏమైనా సరే ఈ సంబంధం చెడకూడదు. మాటిచ్చేశాను."

కూతురికి వయస్సొచ్చినా బైరాగికి అది చిన్న పిల్లలాగే కనిపిస్తుంది. దాని మాట పట్టించుకోనక్కర్లేదనుకున్నాడు. దాన్ని ఏదో యింత ఉన్నవాళ్ళింట్లో పడేస్తే అదే సుఖపడుతుంది. తాను కూడా గడించక్కర లేదు. రామా క్రిష్ణా అంటూ కాలక్షేపం చెయ్యొచ్చును. గవరమ్మ తండ్రి మనసు కనిపెట్టి మరి మాటాడలేదు.

సత్యం బైరాగిని వసారాలోకి పిలిచేడు. వసారాలో చాపమీద పదిమంది కూర్చుని వున్నారు. ఒక ప్రక్కగా లాంతరు వెలుగుతోంది. ఒకడు పేకదస్తా కలుపుతున్నాడు. బైరాగి వచ్చి ఒక మూల నిల్చున్నాడు.

"ఏం బైరాగయ్యా, దీపమేటి మినుకు మంటూంది. కిరసనాయిలు లేదేటి?"

## కాళ్ళు-కళ్ళు

అమెరికా నడకకు
కాళ్ళిచ్చిన పొలం
యు.ఎస్. తళుకులతో
కమ్ముకున్న దబ్బు పొర
కని పెంచిన వారుగాని
కన్న మట్టిగాని
కళ్ళకు ఆనవు
మనసున మన్నవు

## నిచ్చెన

కులం నిచ్చెన
ఉచ్చ సోపానం
పైవాళ్ళ దన్ను
నిచ్చెనకు తన్ను
ఇప్పుడు చూపు
పైకే, పైపైకే
కిందివాళ్ళ
చెడదెందుకు ఇంకా?

-అంబల్ల జనార్దన్

"నేకేం, యిందాకనే పావలా డబ్బులిచ్చి పోయించా, గాలికలా వుందంతే. వానొస్తాదో ఏటో-వేగం కానీండి" అన్నాడు బైరాగి.

"వానొస్తే మా ఆట కట్టేటి? మాకు మరీ మంచిది. పోలీసోళ్ళ బెడదుండదు."

"సరే ఆ భగవంతుడు శ్రీరామచంద్రమూర్తిని తలుసుకుని ఆట మొదలెట్టండర్రా. ఆట గెలిసి తీరు తారు. అయితే ఏ ఆటకా ఆట అవగానే గెలిచినోడు రూపాయికి అణా బాడుగ నాకిచ్చేయాల్సిందే. ఆళ్ళే యిస్తారుగదా అని పోయి పడుకుంటే నిన్న నాకు రూపాయి నష్టమయింది" అన్నాడు బైరాగి.

"పాపం. నష్టమయిందా? బైరాగయ్యా నీ నోటంట ఎప్పుడైనా నిజం పలికితే యినాలనుందయ్యా- ఆట మంచి పట్టులోవుంటే పోలీసులని గావుకేక పెట్టి దీపమార్పేశావు. గందరగోళంలో నాలుగు రూపాయలు డబ్బులు నొల్లుకున్నావు. ఇలా చాలాసార్లు చేశావులే."

"ఛ. ఛ. అమ్మతోడు. అలాటి దగుల్బాజీ పని నానెప్పుడూ సెయ్యనోరే. చీకట్లో ఎవడు కొట్టేశాడో. అయినా బైరాగోడ్ని నాకు డబ్బులెందుకోరే."

"అవును నాయనా అవును. నీ సంగతే చెప్పాలేటి? పోని అందుకనే అసలు నువ్వు ఆటకాడ వుండక, కావాలంటే నీ మేనల్లుడి నుంచి నువ్వు పోయి సితారు వాయించుకో."

"సరేలే నాయముంటే ఎవడూ వుండక్కల్లేదు. బాడుగ డబ్బులు వేరే తీసి పడేండి. అంతే"

"నాయంగా నీ బాడుగ నువుచ్చుకో. కాదనం. కాని మధ్యలో ఉత్తినే పోలీసులంటూ కేకలెట్టి దీపమార్పే డం. డబ్బులు నొల్లుకోడం యిలాంటి దొంగేషాలు ఏశావంటే యీసారి తన్నులు తింటావయ్యా బైరాగీ. యిప్పుడే చెబుతున్నా" అంటూ ఒక జూదగాడు వార్నిం గిచ్చాడు.

ఆట మొదలైంది. మొదట్లోనే హుషారుగా వున్న ఆట చూస్తూ కూర్చున్నాడు బైరాగి.

వీధిలో సత్యం, గవరమ్మ మాట్లాడుకుంటున్నారు. "ఓస్ బెంగెట్టుకుంటావేటే పిచ్చిదానా. మూడో నాటి కల్లా మీ నాయన కోపం అదే చల్లారి పోతాది. మళ్ళీ యిక్కడికే రావచ్చు. మారువాడీకి నామీద గొప్ప గురి ఎప్పుడొచ్చినా నౌకరీ యిస్తానన్నాడు. నెలకు రెండొంద లొస్తాయి. మారాజులా బతకొచ్చు" అంటున్నాడు సత్యం.

బయట కూతురూ, మేనల్లుడూ ఏదో మాట్లాడు కుంటున్నారని కనిపెట్టి బైరాగి వీధిలోకొచ్చి మేనల్లుడ్ని వసారాలోకి పంపించాడు. కూతుర్ని లోపలకు పోయి పడుకోమన్నాడు. తాను వీధి అరుగుమీద కూర్చుని చిలుంగొట్టం ముట్టించాడు.

బైరాగి కూతురు పెళ్ళి గురించే ఆలోచిస్తున్నాడు. ఈ పెళ్లికోసం తాను అయిదు వందలు కూడబెట్టాడు. నగా నాణ్యం చేయించడానికో రెండు వందలు వేరే వుంచాడు. దాని పెళ్ళి వైభవంగా చెయ్యాలి. బైరాగాడు కూతురికి పెళ్ళేం చేస్తాడని నలుగురూ అనడం తనకి తెలుసు. ఈ పెళ్ళి చూసి బైరాగాడు అసాధ్యుడ్రోయ్ అని ఆశ్చర్యపోవాలి. ఎవడూ ఏ లోపమూ వేలెత్తి చూపించకుండా చేస్తాడు.

బైరాగి చిలుం గొట్టం ప్రక్కన పెట్టి అక్కడే నడుం వాల్చేడు. చిన్న మగత నిద్రలో అల్లుడు తన్నెంతో మర్యాద చేసినట్లు తను కూడ కూతురు దగ్గరే వున్నట్లూ కలొచ్చింది.

ఎంత రాత్రయిందో తెలీదు. లోపల వసారాలో అంతా గొల్లుమంటూ లేచేరు. బైరాగి త్రుళ్ళిపడి లేచి కూర్చున్నాడు. వసారాలో దీపం లేదు. ఎవరి దారిన వారు పోతున్నారు.

"ఏటయిందయ్యా" అన్నాడు బైరాగి కళ్లు నులుపు కుంటూ.

"నిజంగానే పోలీసుల ఈల యినిపించింది మరి. ప్రక్క వీధుల్లో వున్నారేమో తెలీదు" అంటూ గబగబ పరిగెత్తేడొక జూదగాడు.

బైరాగి చిలుం గొట్టం తీసుకుని లోపలి కెళ్ళేడు. లోపలంతా చీకటిగా వుంది. చాపమీద ఒకపైసా కూడా లేదు. "ఏంరా సత్తెం, డబ్బులేవీ" అంటూ కేక పెట్టేడు. లాంతరు వొత్తి పెద్దది చేసి లోపలికెళ్ళేడు. సత్యం ఎక్కడా లేదు.

"ఈ దొంగ వెధవ దీపమార్చి డబ్బులు పట్టుకు పోయినట్టున్నాడు" అనుకుంటూ

"తల్లీ గవరమ్మా" అని పిలిచేడు కూతుర్ని. కూతురు కనపడలేదు.

గవరమ్మ తన్ను వదలిపెట్టి పోయిందా? బైరాగికి మతిపోయింది. కుప్పలా నేలకూలబడ్డాడు. చీకటి వెలుగులకు గంతకట్టి దాగుడు మూతలు ఆడిస్తూ వచ్చిన బైరాగి కళ్లు బయర్లు కమ్మేయి. ఆ లాంతరు ఎక్కడుందో కాని తాను ఈ చీకటి గుయ్యారం నుండి బయటపడేటట్టులేదు. ఇప్పుడు నిజంగానే జీవితం చేదనిపించింది. ■